క్లుప్తంగా

గ్రీవెన్స్‌కు అధికారులందరూ హాజరు కావాలి

నకరికల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు ఉదయం 10 గంటలకల్లా విధిగా హాజరుకావాలని తహసీల్దార్ కె.పుల్లారావు శనివారం తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దాఖలు చేసిన అర్జీలను వెంటనే పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

అమరావతి: మండల పరిధిలోని పాందుగల గ్రామంలో ఆదివారం విశ్వమాత గాయత్రి చారిటబుల్ ట్రస్ట్, గుంటూరు బీఎస్ఐ ఫోర్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచితమెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని విశ్వమాత గాయత్రి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాందుగల గ్రామంలోని గాయత్రితీర్థం - శ్రీరామకృష్ణ శాంతి ఆశ్రమం ఆవరణలో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో 13 విభాగాలకు చెందిన వైద్య నిపుణులు రోగులను పరీక్షిస్తారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభిస్తారని తెలిపారు. మండల పరిధి గ్రామాల ప్రజలు ఈ మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పశువులకు వ్యాక్సిన్లు



క్రోసూరు: జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమాల్లో భాగంగా మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పశువైద్యశిబిరాల్లో భాగంగా శనివారం దొడ్లేరు, పీసపాడు, ఊటుకూరు గ్రామాల్లో వాక్సిన్లు వేసినట్లు మండల పశువైద్యులు డాక్టర్ మల్లయ్య తెలిపారు. గాలికుంటువ్యాధి నివారణ వాక్సిన్లు, బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్లు 250 పశువులకు వేసినట్లు చెప్పారు. ఈనెలాఖరు వరకు నిర్వహించే పశు వైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారం చోరీపై కేసు నమోదు

పెదకూరపాడు: 32 గ్రాముల బంగారం చోరీకి గురైన ఘటనపై పెదకూరపాడులోని పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదయింది. ఎస్ఐ రాంజీ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జలాలపురం గ్రామంలో కొల్లి హైమావతి తన గృహానికి మరమ్మతులు చేయిస్తుంది. ఈ క్రమంలో ఈ నెల 4న ఇంటిలో ఉన్న 32 గ్రాముల బంగారాన్ని, సామగ్రిని వరండాలో ఉంచారు. బంగారాన్ని బాత్ రూము కిటికీలో ఉంచారు. మరుసటి రోజు బంగారం దాచిన సంచి కనిపించకపోవడంతో, ఇంటి సభ్యులను, కూలీలను విచారించగా తెలియదని చెప్పడంతో పెదకూరపాడు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు రాంజీ నాయక్ తెలిపారు.

మృతదేహం లభ్యం

తాడికొండ: తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలోని రేగుతోటలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న తుళ్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు అమరావతి మండలం ధరణికోటకు చెందిన ధనేకుల వెంకటేశ్వరరావు (53)గా గుర్తించారు. అతను గత నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో తప్పిపోయాడని కుటుంబ సభ్యులు గుర్తించారు. శనివారం రేగు తోటలో మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులకు జేబులో ఆధార్ కార్డు లభించడంతో బంధువులకు సమాచారం అందించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నట్లు తుళ్లూరు ఎస్ఐ కలగయ్య తెలిపారు.

దివిస్ ల్యాబ్‌లో 20 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో దివిస్ ల్యాబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్థులు 80 మంది ప్రాంగణ ఎంపికలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఇంటర్వ్యూలు, రాతపరీక్షలు నిర్వహించి 20 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. దివిస్ సంస్థ ప్రతినిధులు జె.శివకృష్ణ, రామకృష్ణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ పరిశ్రమలు నుంచి కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ్‌భూషణ్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారులు డాక్టర్ డి.అశోక్‌రెడ్డి, ముగ్గ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే దేశాభివృద్ధి

- వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సత్తెనపల్లి: మహిళలు వారు నిర్వహిస్తున్న రంగాల్లో ఉన్నతంగా ఎదిగి ఆనందంగా జీవించాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ లక్ష్యాలు సాధించేందుకు ధైర్యంగా ముందుకు సాగినప్పుడే విజయాలు సొంతమవుతాయన్నారు. దేశాభివృద్ధికి మహిళాభివృద్ధి గీటురాయి లాంటిదని భావించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలను పెద్దఎత్తున ప్రోత్సహించారన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా పక్షపాతి పార్టీ అన్నారు. 30 లక్షల ఇళ్లపట్టాలు మహిళలు పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. వివిధ రంగాలలో విజయం సాధించిన మహిళల ప్రతిభను కొనియాడారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా దినోత్సవ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయన్నారు. ప్రస్తుతం పాలకుల మాటల్లోనే మహిళా సాధికారిత ఉందని చేతల్లో లేదన్నారు. ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం కురిపించిన హామీలు ఒకటి కూడా అమలు కావడం లేదని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించి గౌరవించడం ద్వారానే మహిళాభ్యుదయం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. కౌన్సిలర్లు బండి రాజ్యలక్ష్మి, లోక కళ్యాణి, పెద్దింటి గోవిందమ్మ, కో–ఆప్షన్ మెంబర్ కొణతం స్వాతి, డాక్టర్ అనిత, భవనం శివమ్మ, స్వప్న, లక్ష్మి, మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి కార్యాలయంలో కేక్ కటింగ్‌లో డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి, డాక్టర్ గీతాహాసంతి, చల్లంచర్ల లక్ష్మీతులసి, మహిళలు

ఆత్మవిశ్వాసంతో ముందడుగు

పెదకూరపాడు: ప్రతి మహిళా ఆత్మవిశ్వాసంతో, మనోధైర్యంతో ముందడుగు వేయాలని పెదకూరపాడు సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీవిద్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాగులూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పెదకూరపాడు సామాజిక కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అగ్రస్థానం కల్పించాలి

సత్తెనపల్లి: సమాజంలో మహిళలకు అగ్రస్థానం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాదా మల్లికార్జునరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసిని శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇప్పటికే విప్లవాత్మకమైన పురోగతిని సాధించడంలో మహిళలు ముందున్నారన్నారు. వారికి మరింత ప్రోత్సాహం అందిస్తే ఇంకా అభివృద్ధి సాధిస్తారని అభిప్రాయపడ్డారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ సమాజంలో మహిళలు మరింత చైతన్యవంతులు కావాలన్నారు. చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి ఆమె భర్త సాంబశివరావును పూలమాలలు దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో గోల్డ్ అప్రైజర్ మద్ది భాస్కర్, మైనార్టీ నాయకుడు షేక్ జాకీర్, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, నాయకులు కొత్తూరు విశ్వేశ్వరరావు, కొత్త లక్ష్మయ్య, పిల్లుట్ల ఆంజనేయులు, సత్తెనపల్లి నాసరయ్య, జయరావు, షేక్ ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసిని పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ ఆనందరావు, మున్సిపల్ మేనేజర్ ఎన్ సాంబశివరావు, పురపాలక సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ప్రజా చైతన్య భారతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దూపగుంట్ల జానకి రామారావు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో గైనకాలజిస్ట్ సుజాత, ఆర్ఎంవో శోభారాణిలను శనివారం సత్కరించారు. నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



పెదకూరపాడు వైద్యశాలలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొంటున్న మహిళ ఉద్యోగులు

మహిళలకు సన్మానం..



క్రోసూరు: క్రోసూరులోని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించారు. స్థానిక కంబంపాటి రామ్మోహన్ రావు గృహంలో జరిగిన కార్యక్రమలో యోగా ధ్యానం తరగతులు నిర్వహిస్తున్న కంబంపాటి లక్ష్మి, అదేవిధంగా క్రోసూరు జైభారత్ స్కూల్ హిందీ ఉపాధ్యాయురాలు జుజ్జూరు నిర్మలదేవీలను సన్మానించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు గ్రంధి విజయకుమార్, తొమ్మండ్రు నాగేశ్వరరావు, కట్టమూరి అప్పారావు, చుండూరు కేశవరావు, మేకల బాబు, మహిళలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో అవార్డు అంతిమ తీర్పు

సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ్‌కుమార్ రెడ్డి



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి

సత్తెనపల్లి: లోక్ అదాలత్‌లో అవార్డు అంతిమ తీర్పుఅని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సత్తెనపల్లి వి.విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో ఉన్న నాలుగు న్యాయస్థానాల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ రెండు బెంచ్‌లుగా శనివారం నిర్వహించారు. మొదటి బెంచ్ సబ్ కోర్టు పరిధిలో ఉన్న కేసులు, పి.ఎల్.సి లు పరిష్కరించబడ్డాయి. ఈ బెంచ్‌కు న్యాయమూర్తిగా సివిల్ జడ్జి వి.విజయ్ కుమార్ రెడ్డి, లోక్ అదాలత్ సభ్యుడిగా దివ్వెల శ్రీనివాసరావు వ్యవహరించారు. రెండవ బెంచ్ సత్తెనపల్లి పట్టణంలో ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ కోర్టులో మొదటి అదనపు సివిల్ కోర్టు, రెండవ అదనపు సివిల్ కోర్టు పరిధిలో ఉన్న కేసులు మొత్తాన్ని ఈ రెండవ బెంచ్‌లో పరిష్కరించారు. ఈ బెంచ్‌కు ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్ న్యాయమూర్తిగా, లోక్ అదాలత్ సభ్యుడిగా న్యాయవాది గంటా వెంకట శివలు వ్యవహరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 16 కేసులు పరిష్కారం

క్రోసూరు: జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా శనివారం మండలం నుంచి 16 కేసులు పరిష్కారం లభించినట్లు ఎస్ఐ నాగేంద్రరరావు తెలిపారు. నాగవరం, పీసపాడు, క్రోసూరు, గాదెవారిపాలెం తదితర గ్రామాల నుంచి 16 క్రిమినల్‌కేసులు మొదటి మునిసిఫ్ కోర్టు జడ్జి కౌషిక్ ఆధ్వర్యంలో పరిష్కరించబడినట్లు ఎస్ఐ వివరించారు.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు ఇర్మియా



మాట్లాడుతున్న న్యాయ వాది బత్తిన శ్రీనివాస్‌బాబు

సత్తెనపల్లి: వామపక్ష భావాల పట్ల అంకితభావం కలిగి, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి స్వర్గీయ పోసిపోగు ఇర్మియా అని న్యాయవాది బత్తిన శ్రీనివాస్ బాబు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం కవికోకిల శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పోసిపోగు ఇర్మియా సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయవాది శ్రీనివాసబాబు మాట్లాడుతూ వర్తమాన, సామాజిక రాజకీయ అంశాలపై నిశితమైన పరిశీలన ఉన్న మేధావి ఇర్మియా అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తూ ఆదర్శంగా ఉన్న వ్యక్తి అని కొనియాడారు. న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడుతూ సీపీఐ నేత ఇర్మియా మరణం వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్, నాయకులు ఏఎస్ఆర్ జక్కం, దళిత మహాసభ రాష్ట్ర నాయకులు కోరబండి ఆంథోనీ, మాతంగి సాంబశివ రావు, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్ఎం సుభాని, గుజ్జర్లపూడి జాన్ బాబు, జయకుమార్, సురేష్ బాబు, గుర్రం అనిల్, జోసెఫ్ కుమార్, ప్రసాద్, పోతురాజు తదితరులు యిర్మియా సేవలను కొనియాడారు. తొలుత ఇర్మియా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకులు, గుర్రం జాషువా సాహిత్య సేవా సంస్థ బాధ్యులు, తదితరులు ఉన్నారు.

వైభవంగా కల్యాణ వేడుకలు



కుంకలగుంటలో నీలకంఠేశ్వరస్వామి కల్యాణ వేడుకలు

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగంగా భ్రమరాంబ సమేత నీలంకంఠేశ్వరస్వామి వారి కల్యాణ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిపించారు. అర్చకుడు పత్రి లింగారావు ఆధ్వర్యంలో స్వామివారిని విశేషంగా అలంకరించారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణ వేడుకలను కనులపండువగా జరిపించారు. డాక్టర్ యరగాటి సాంబశివారెడ్డి, రోసిరెడ్డిల ఆధ్వర్యంలో స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయం వద్ద మహా అన్నదానం చేపట్టారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించిన భక్తులు, అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు.

చేపల దాణా తిని ఎనిమిది గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

ముప్పాళ్ళ: చేపలకు వేసే దాణా తిని 8 గొర్రెలు మృత్యువాత పడ్డ సంఘటన మండల కేంద్రమైన ముప్పాళ్ళలో శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించి బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈర్ల వెంకటేశ్వర్లు గొర్రెలు మేపుకొనేందుకు వెళ్లి వస్తుండగా చెరువు కట్టపై ఉన్న దాణాను తిని చెరువులోకి దిగి నీరు తాగాయి. కొద్ది సేపటి తర్వాత నోటి వెంబడి నురుగు కక్కి అక్కడికక్కడే చనిపోయాయి. మరికొన్ని గొర్రెలు అపస్మారక స్థితిలోకి వెళ్లటంతో ఇంటికి తీసుకెళ్లి వైద్యసేవలందిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎనిమిది గొర్రెలు చనిపోగా, మరో ఐదు గొర్రెల పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితుడు చెప్పాడు. సుమారు రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న ముప్పాళ్ల ఎస్ఐ వి.సోమేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన తీరుపై బాధితుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.

రక్తదానంలో స్వచ్ఛందంగా పాల్గొనాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అదితి

నరసరావుపేట రూరల్: ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సతీమణి డాక్టర్ అదితి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ అదితి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రక్తం సకాలంలో అందకపోవడం వలన ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రక్తదాన శిబిరాల ద్వారా అరుదైన బ్లడ్ గ్రూపులు కలిగిన వారి వివరాలు సేకరించి అత్యవసర సమయాల్లో సంప్రదించడం జరుగుతుందని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరంలో సేకరించిన రక్తానికి అన్ని పరీక్షలు నిర్వహించి తలసేమియా, ఎనీమిక్, సికల్సెక్సెస్ వంటి వ్యాధులతో బాధపడే వారికి ఉచితంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ శరత్‌బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ సృజనా, డాక్టర్ రెహమతుల్లా పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు

చిలకలూరిపేట: పాలిథిన్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పాలిథిన్ కవర్ల వ్యాపారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి పట్టణంలో పాలిథిన్ కవర్ల వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వినియోగించినా, విక్రయించినా రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధించబడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్‌వీ రమణరావు, సీహెచ్ సునీత పాల్గొన్నారు.

నేడు జాతీయస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని చైతన్య కళాస్రవంతి 46వ వార్షికోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో జాతీయ స్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు ఆదివారం పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో (ఐఎంఏ) జరుగుతాయని చైతన్య కళా స్రవంతి అధ్యక్షుడు కమతం శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పాటల పోటీలలో భాగంగా చైతన్య కళాస్రవంతి విశిష్ట పురస్కారాన్ని ఎనిమిది మందికి అందిస్తున్నట్లు చెప్పారు. పాటల పోటీలు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో పాల్గొనదలిచి వారు తమ పేర్లను ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌సీఎం.సుభానిని సంప్రదించ గలరన్నారు. అలాగే చైతన్య కళాస్రవంతి విశిష్ట పురస్కారాలను అందుకోబోతున్న వారిలో టి.ఆంజనేయులు(ఎస్ఏ, మునిసిపల్ బాయ్స్ హైస్కూల్ నరసరావుపేట), శ్రీలక్ష్మి (ఇన్‌చార్జి ఏపీఓ. – ఏఎంఓ సమగ్ర శిక్ష గుంటూరు), బి.కుమారి(పీజీటీ తెలుగు, కేజీబీ విద్యాలయం వెల్దుర్తి), ఎ.ఏమండీ (ఎస్‌జీటీఎంపీఎస్–ఎస్‌టీ రెడ్డి పాలెం), పుల్లాగూర దిబ్బయ్య(ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ ఎఫ్‌సీ రాయపూడి), కొప్పురావూరి కాశీవెంకట సుబ్బారావు (అధ్యక్షుడు, వాసవి మణికంఠ క్లబ్, సత్తెనపల్లి), మైలా వేణుగోపాల్ యాదవ్(సీఆర్‌ఎం టీచర్. ఎంఈఓ ఆఫీస్, తుళ్లూరు), చిలుక మంజువాణి (పీజీటీకేజీ విద్యాలయం రాజుపాలెం)లకు అందించటం జరుగుతుందన్నారు. ప్రధాన కార్యదర్శి గుండవరపు అమర్‌నాద్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు పరిధిలో శనివారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. స్థానికులు నుంచి సేకరించిన వివరాలు.. గ్రామంలోని కొత్తూరు బొడ్రాయి సెంటర్ నివాసితులైన ముస్లిం కుటుంబాలకు చెందిన మహిళలు రోజుమాదిరిగానే మిరప తోటల్లో వ్యవసాయ కూలీ పనులు చేసుకునే నిమిత్తం శనివారం ఉదయం 6 గంటలకు ఆటోలో బయలు దేరారు. నాదెండ్ల మండలం తూబాడు గ్రామానికి వెళ్లేందుకు 16నంబర్ జాతీయ రహదారిపైకి రాగానే అండర్‌పాస్ హైవే వంతెన మీదుగా వేగంగా దూసుకువచ్చిన గుర్తు తెలియని వాహనం ఆటో వెనుక భాగంలో ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొడుతూ దూరంగా ఉన్న సర్వీసు డివైడర్ పక్కన ఏర్పాటు చేసిన ఐరన్ సేఫ్టీరాడ్లకు గుద్దుకుని ఆగిపోయింది. అయితే ఢీకొట్టిన వాహనం మాత్రం నిలుపుదల చేయకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటో ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న 14 మంది కూలీలతో పాటు ఆటో డ్రైవరకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులతో పాటు బాధితుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకున్నారు. నుజ్జునుజ్జయిన ఆటో, చిందరవందరగా గాయాలతో పడిఉన్న కూలీలు భయాందోళనకు గురై కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు బాధితులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలైన ఆరుగురిని జిల్లాకేంద్రం నరసరావుపేట కార్పొరేట్ ఆస్పత్రులకు, మరొకరిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వీరిలో జీజీహెచ్‌కు తరలించిన షేక్ రహంతుల్లాబి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు



క్రోసూరు: క్రోసూరు ప్రధాన రహదారిలో చెరువుగట్టు వద్ద 32 అడుగుల అభయాంజనేస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈనెల 12వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయకమిటీ ఏర్పాట్లు చేసింది. ఈనెల 10వ తేదీన వేదపండితుల ఆహ్వానం, బింబమునకు జలాధివాసము, సూక్తపారాయణం, అర్చనలు, ఆహ్వానదేవతా హోమ విధులు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 11వ తేదీన అభయాంజనేయస్వామి అర్చన, సింధూరపూజ, ఆకుపూజ, తీర్థగోష్టి, 12వ తేదీన శైవ క్షేత్రపీఠాధిపతులు, హిందూ ధర్మపరిరక్షకులు, తాళ్లాయపాలెం శివస్వామిచే 10.39 గంటలకు ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల రెడ్డిపాలెం ఆంజనేయ స్వామి గుడి సమీపంలో శనివారం లారీలో ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. మినీ లారీలో ఈ బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో దాడి చేసి పట్టుకున్నామన్నారు. లారీ, బియ్యంతో పాటు లారీ నడుపుతున్న వి.పి.కాశిరెడ్డిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పాఠశాలకు జాతీయ స్థాయిలో ఎల్లో రేటింగ్



ఎల్లో సర్టిఫికెట్లతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలో కొత్తపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నేషనల్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో భాగంగా జాతీయ స్థాయిలో స్కూల్ ఎల్లో రేటింగ్ సాధించిందని ప్రధానోపాధ్యాయులు బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా తమ పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం జరుగుతుందని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ నియమాల కనుగుణంగా అమలు చేస్తున్నామని అన్నారు. జాతీయ స్థాయిలో తమ స్కూల్ ఎల్లో రేటింగ్ సాధించటం లో కో–ఆర్డినేటర్ గా ఉపాధ్యాయులు వై.మల్లికార్జునరావు వ్యవహరించారని అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఎల్లో రేటింగ్ సాధించటంపై ప్రధానోపాధ్యాయులు బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు మల్లికార్జునరావును ఎంఈఓలు హవేల, డి.బ్రహ్మేశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ జంగుల పెద్ద శేషయ్య అభినందించారు.

పదో తరగతి విద్యార్థుల పూజలు

నూజెండ్ల: స్థానిక లక్ష్మీ చెన్నకేశవ, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాల్లో పాల్గుణ మాసం శనివారం సందర్భంగా కేజీబీజీ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 17వ తేదీ నుంచి పది పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో మంచి ఫలితాలు సాధించేలా హాల్ టికెట్లను స్వామి వారి పాదుకుల వద్ద ఉంచి హనుమాన్ చాలీసా పారాయణం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తోమాల సేవ తదితర పూజలు ఆలయ పూజారి కోసూరి రామమోహనాచార్యులు నిర్వహించారు.

అమీన్‌సాహెబ్‌పాలెంలో కంటి వైద్య శిబిరం



నాదెండ్ల: అమీన్‌సాహెబ్ పాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం కాకాని శంకర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బండ్లమూడి సీతారామయ్య, అఖిలాండమ్మ జ్ఞాపకార్థం వారి మనువడు పాటిబండ్ల శేఖర్‌బాబు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచి కామినేని లలితానాగేశ్వరరావు ప్రారంభించారు. డాక్టర్ శ్వేత, డాక్టర్ సాయి సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వీరిలో 30 మంది కంటి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేసి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శనివారం 20 మందిని ఆస్పత్రి వాహనాల్లో ఆపరేషన్లకు తరలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గుర్రం ఉపేంద్ర, ప్రస్తుత ఉపసర్పంచి తేళ్ల రాజేష్, నాయకులు గుర్రం నాగపూర్ణచంద్రరావు, రామారావు పాల్గొన్నారు.